వీసీ గా డాక్టర్ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 18 : ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి నల్లగొండ జిల్లాకు చెందిన డా.జానయ్యను ఉపకులపతి (వీసీ) గా ప్రభుత్వ నియమించింది. దాంతో పలు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. బహీవర్గానికి చెందిన వ్యక్తిని వీసీ గా నియమించడం అభినందనీయమని, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌లకు బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్, నాయకులు రమేశ్, కృష్ణ , కవిత, సంతోష్ అభినందనలు తెలిపారు.ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తానని డాక్టర్. జానయ్య అన్నారు.

మానసిక దివ్యాంగులకు ఉచిత విద్య, వసతి

జూబ్లీహిల్స్ : నవంబర్ నుంచి ప్రారంభించనున్న జనహిత జానకి జీవన్ మానసిక దివ్యాంగుల బాలుర వసతి గృహం, పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్.సుబ్బలక్ష్మి, కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక దివ్యాంగులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఫిజియో, స్పీచ్ థెరపీ ఇస్తూ వారి తల్లిదండ్రులకు ఉచిత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల శక్తిసామర్థాలకు అనుగుణంగా ఫైల్స్ తయారీ, అగరబత్తీలు, కొవ్వొత్తులు, జనపనార బ్యాగులు, నోట్ బుక్స్, మసాలా పొడులు, విస్తరాకులతో పళ్లెములు, దొన్నెలు తయారు చేయడంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 98480 96912, 99899 92768 లో సంప్రదించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దు

జడ్సీ ఉపేందర్ రెడ్డి ప్రశ్నలకు సమాధానమిస్తున్న యూసుఫ్‌గూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి

జూబ్లీహిల్స్, అక్టోబర్18 : అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దని.. ప్రాథమిక స్థాయిలోనే వాటిని నియంత్రించి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం శేరిలింగంపల్లిలోని జోనల్ కార్యాలయంలో యూసుఫ్‌గూడ సర్కిల్‌తో పాటు వివిధ సర్కిళ్ల అధికారులతో పట్టణ ప్రణాళికా విభాగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీఎస్ బీపాస్ ద్వారా అనుమతుల జారీని ప్రభుత్వం సుళువు చేసినందున నిర్మాణదారులు సద్వినియోగం చేసుకునేలా ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. అందుకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలకు నోటీసులిచ్చి నిలిపివేయాలని.. ఆయా నిర్మాణాలకు సంబంధించి సకాలంలో కోర్టుల్లో కౌంటర్ కేసులను ఫైల్ దాఖలు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యల సత్వర పరిష్కారానికి రహదారుల విస్తరణకు ప్రాధాన్యతనివ్వాలని.. ఇందుకుగానూ ఆస్తుల గుర్తింపు, సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. కోర్టు కేసుల్లో ఉన్న స్థలాల్లో ఎట్టి పరిస్థితిలో నిర్మాణాలు జరుగనివ్వవద్దని.. పర్యవేక్షణ, చర్యలు పరంగా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. నిర్మాణాల పరంగా క్షేత్ర స్థాయిలో అత్యంత పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని.. కార్యాలయాలలో కూర్చుని అనుమతులు మంజూరు చేసే విధానాలకు ఇకనుంచి స్వస్తి పలుకాలని జడ్సీ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి, ఇతర సర్కిళ్ల అధికారులు పాల్గొన్నారు.

నాలాపై వెలసిన అక్రమ నిర్మాణాలు

దసరా సెలవుల్లో అక్రమ నిర్మాణదారులు నాలాలపై షెటర్లను నిర్మించారు. అధికారులు పట్టించుకోక పోవడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రత్నదీప్ సూపర్‌మార్కెట్ ఎదురుగా నాలా ఉండేది. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపడితే అధికారులు కూల్చి వేశారు. సెలవులు కలిసి రావడంతో అక్కడ నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోక పోవడంపై ఆరోపణలు చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- బండ్లగూడ

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

నారాయణగూడ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలిగించారు. చిరువ్యాపారస్తులు దుకాణాలను తొలగించడంతో పోలీసులపై మండి పడ్డారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారం చేసుకునే వ్యాపారస్తులపై నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆపరేషన్ ఫుట్‌పాత్ పేరుతో శుక్రవారం సాయంత్రం హిమాయత్‌నగర్ వీధి నం. 9 నుంచి

- హిమాయత్‌నగర్

రోడ్లపై పేరుకుపోతున్న వ్యర్థాలు

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్ల పక్కన వ్యర్థాలు, చెత్తకుప్పలు నిండిపోతున్నాయి. అత్తాపూర్ నుంచి ఎమోరీ దవాఖానకు వెళ్లే దారిలో, రాంబాగ్ నుంచి శ్రీనికేతన్ స్కూల్‌కు వెళ్లే దారి, చిన్న అనంతగిరి ఆలయానికి వెళ్లే దారి ఇలా.. రహదారులపై చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని బస్తీలు, కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. మేయర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చక్రవర్తి, జనరల్ సెక్రటరీ విజయతా కూర్, కాలనీ వాసులు కేవీ ప్రసాద్, అనిల్ అత్తర్‌అలీ, తిరుమలేశ్, జ్యోతి పాల్గొన్నారు.

- బండ్లగూడ

అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయండి

ఈఈ రాజ్‌కుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 18 : యూసుఫ్‌గూడ డివిజన్‌లో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ –19 వ సర్కిల్ కార్యాలయంలో అంతర్గత రోడ్ల సమస్యపై ఈఈ రాజ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. శ్రీకృష్ణానగర్ ఏ – బ్లాక్, లక్ష్మీనరసింహనగర్, వెంకటగిరి ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నాలాల్లో సిల్ట్ పేరుకుపోయి వరద రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలకు నడక నరకయాతనగా మారిందన్నారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ రోడ్లకు నిధులు మంజూరుచేసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. డివిజన్‌లో సర్వే చేపట్టి కొత్త రోడ్లకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఐలపాక నర్సింగ్‌దాస్, నాయకులు గీతా గౌడ్, వేణు గోపాల్, బాబి, చిన్న, ప్రశాంత్, ఆజం, వెంకటేశ్ పాల్గొన్నారు.

మార్స్ పెట్‌కేర్, బ్లూక్రాస్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్‌లో జాతీయస్థాయి అడాప్షన్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై వదిలిపెట్టిన కుక్కపిల్లలు, పిల్లులను సంరక్షించడంతో పాటు వాటిని అవసరమైన వారికి ఇచ్చి మూగజీవాలకు ఆశ్రయం కల్పించేందుకు అడాప్షన్ డ్రైవ్ చేపట్టామని కార్యక్రమంలో పాల్గొన్న మార్స్ పెట్‌కేర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి తెలిపారు.

- బంజారాహిల్స్

సీసీ రోడ్డు ప్రారంభం..

బంజారాహిల్స్, అక్టోబర్ 18 : బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్‌బీ నగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. బస్తీలో పెండింగ్ రోడ్డు పనులన్నీ త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ తెలిపారు.

ఆత్మరక్షణ క్రీడల్లో శిక్షణ అవసరం

విద్యార్థులకు చిన్ననాటి నుంచే క్రీడల్లో శిక్షణ అవసరమని.. ముఖ్యంగా ఆత్మరక్షణ క్రీడల్లో బాలికలు తర్ఫీదు పొందాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన షావోలిన్ కుంగ్‌ఫూ బెల్ట్ గ్రాండింగ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కుంగ్‌ఫూ శిక్షణ పూర్తిచేసుకున్న చిన్నారులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి వారిని అభినందించారు.

- జూబ్లీహిల్స్

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

మీడియాతో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు రెండు లక్షల కోట్లను ఇతర పథకాలకు ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. దళితులకు కేటాయించిన నిధులను వారి సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మాతంగి హనుమంతు, మద్దెల ప్రవీణ్ కుమార్, సుబ్బారావు, గోలి నరేశ్ పాల్గొన్నారు.

మోడలింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు

బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రామలక్ష్మి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 18 : మోడలింగ్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని బాబు జగ్జీవన్‌రాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్, ప్రతినిధి డాక్టర్ రామలక్ష్మి అన్నారు. బ్యూటీషియన్, వెల్నెస్ అంశంపై శుక్ర వారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వర్క్‌షాప్ జరిగింది. వారు మాట్లాడుతూ.. అందాన్ని మెరుగు పరుచుకుని ఆత్మవిశ్వాసంగా ఉండేందుకు బ్యూటీషియన్ కోర్సులు దోహదపడటంతో పాటు ఉపాధి పొంది ఆదాయ మార్గాలు సైతం లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాజ్‌కుమార్, గౌతమి, డాక్టర్ దీపిక, ఉమాదేవి, సూర్యకుమారి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, అక్టోబర్ 18 : డ్యూటీకి వెళ్లి వస్తానంటూ చెప్పి ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన ఖైరతాబాద్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉండే బి. శ్వేత బంజారాహిల్స్‌లోని ఏఐఎన్‌యూ హాస్పిటల్‌లో హౌస్ కీపర్‌గా పనిచేస్తున్నది. ఈ నెల 15న విధులకు వెళ్లి వస్తానని చెప్పి పనివేళలు ముగిసిన తర్వాత కూడా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద ఆరాతీసినా ఆచూకీ లభించ లేదు. శ్వేత కొంతకాలంగా ఓ సెక్యూరిటీ గార్డుతో ప్రేమలో ఉందని, అతడి వెంట వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ చోరీ..

బంజారాహిల్స్ : బసవతారకం క్యాన్సర్ దవాఖాన ఆవరణలోని సాయిబాబా ఆలయ హుండీని చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట, శ్రీరమణ కాలనీలో ఉంటున్న అర్చకుడు అజయ్ కృష్ణ బంజారాహిల్స్ రోడ్ నం.10లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ దవాఖాన ఆవరణలోని సాయిబాబా ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. 16న సాయంత్రం పూజ ముగించుకుని ఇంటికి వెళ్లిన అజయ్‌కృష్ణ మరుసటిరోజు ఉదయం 7: 40 గంటలకు ఆలయానికి వచ్చాడు. ఆలయ హుండీ కనిపించకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ప్రమాదవశాత్తు నీటిలోపడి హోం గార్డు మృతి

ఖైరతాబాద్, అక్టోబర్ 18 : ప్రమాదవశాత్తు నీటిలోపడి ఓ హోంగార్డు మృతి చెందాడు. ఏపీ, విజయనగరానికి చెందిన జి. సింహగిరి (42) ఏడాదిన్నరగా ఖైరతాబాద్ పీఎస్‌లో హోం గార్డుగా పనిచేస్తున్నాడు. వారంక్రితం భార్య డెలివరీకి ఉండడంతో విజయనగరానికి చేరుకున్నాడు. గురువారం బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా, నీటిలో విగతజీవిగా పడి ఉన్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సింహగిరి మృతికి ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సిబ్బంది సంతాపం తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్ : నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డిని శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..శంషాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ షాబాద్ మండలంలోని నాగర్‌గూడ వరకు రెండు నియోజకవర్గాలకు కలిపే రోడ్డు విస్తరణకు రూ. 50 కోట్లు విడుదల చేయాలని కోరిన్నట్లు తెలిపారు. శంషాబాద్ బస్‌స్టాండ్ నుంచి ఒయాసిస్ పాఠశాల వరకు రోడ్డు విస్తరణకు ఆర్ అండ్ బీతో పాటు హెచ్ఆర్టీసీఎల్ సంస్థల నుంచి మంజూరు కావడంతో త్వరగా పనులు ప్రారంభించే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు.గండిపేట్ నుంచి శంకర్‌పల్లి వరకు ఆరు లైన్ల రోడ్డుకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరగా.. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు.

రూ.8.10 కోట్లతో అభివృద్ధి పనులు

మణికొండ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు డివిజన్లలో శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ రూ.8.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అధికారులు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కో – ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, వైస్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, కౌన్సిలర్లు దుర్గేశ్ యాదవ్, శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, జి.అరుణజ్యోతి, కె.లక్ష్మీప్రవళిక కిరణ్, గున్నాల అమరేందర్‌రెడ్డి, జి.వెంకటేశ్ యాదవ్, కోటిగారి ఉషారాణి, కుతాటి నరేశ్, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేశ్ కుమార్, మేనేజర్ యోగేశ్, ఏఈ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

తెలంగాణ వ్యసాయరంగానికి గుర్తింపు

కర్ణాటక వ్యవసాయ మంత్రి చలువ రాయస్వామి తో రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 18 : అనతి కాలంలోనే తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి ఎన్. చలువ రాయస్వామి అన్నారు . శుక్రవారం ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించారు. పరిపాలన భవనం వద్ద ఆయనకు రిజిస్ట్రార్ పి. రఘురామిరెడ్డి స్వాగతం పలికారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులలో మంత్రి ముఖాముఖి సమావేశం అయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపడుతున్న బోధనా, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలను తెలుసుకున్నారు. వివిధ విభాగాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, అందిన పురస్కారాల వివరాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత అనతికాలంలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలు అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. ప్రణాళికా బద్ధంగా అమలు చేయడం, వరి అధిక దిగుబడి పొందడంతో గుర్తింపు లభించిందన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్రోన్ అకామిని వ్యవసాయ శాఖ మంత్రి సందరర్శించారు. డ్రోన్ ద్వారా అందిస్తున్న సేవల వివరాలు శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. పరిపాలన భవన్‌లోని అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి ఓఎఎన్డీ ప్రొ. పాటిల్ , వ్యవసాయ విశ్వవిశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకట రమణ,ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

వెంగళరావునగర్, అక్టోబర్ 18 : ఒయో రూములు, లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ హెచ్చరించారు. సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం ధ్వంసం కేసులోని ప్రధాన నిందితుడు బస చేసిన హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. హోటల్‌లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే విధంగా శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలోని ఒయో హోటళ్లు, లాడ్జీల మేనేజర్లు, యజమాన్యాలతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. డీసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలు పరిశీలించాకే రూం ఇవ్వాలని.. వాటిని పరిశీలింతడంతో పాటు కస్టమర్లు చెప్పే ఫోన్‌నంబర్లు చెక్ చేసుకోవాలని సూచించారు.మైనర్లు వస్తే వారికి రూమ్ ఇచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గదుల్లో పేకాట ఆడుతున్నట్లు తెలిసినా.. జ్యోతిష్యం చెప్తామని వచ్చేవారిపై , రోగాలు నయం చేస్తామని వచ్చే నకిలీ ఆయుర్వేద వైద్యులు వచ్చినా సమాచారం ఇవ్వాలని కోరారు. మత మరమైన కార్యక్రమాలను నిర్వహిస్తే అనుమతి ఉందో.. లేదో పరిశీలించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకట రమణ, ఎస్ఆర్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీర శేఖర్, పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కేశవ్ నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, అక్టోబర్ 18: వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని కేశవ్ నగర్ కాలనీలో మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను కలుస్తామని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానికుల సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేటర్ పర్యటించారు. సమస్యలను జలమండలి, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ఇబ్రహీంనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పాడయిపోయిన ఆహారపదార్థాలు ఇస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేయడంతో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుడ్లలో కొన్ని కుళ్లిపోయిన విషయాన్ని గుర్తించడంతో పాటు ఇతర ఆహారపదార్థాల్లో నాణ్యత లోపించినట్లు తేలింది. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

ఘాన్సిమియాగూడ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు చిలకమర్రి మహేందర్, జిల్లా ఆనంద్ లిమ్స్ దవాఖాన ఎండీ డాక్టర్ రామ్‌రాజ్ సహకారంతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ మల్లేశ్ గౌడ్, లీడర్ జంగయ్య, రవీందర్‌గౌడ్, జిల్లా నందం, బాబు,రాజు, శ్రీనివాస్, ఇమ్రాన్ పాల్గొనారు.

- శంషాబాద్ రూరల్

బహిరంగ ప్రకటన

తేది: 18-10-2024

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా సమాచారమివ్వునది ఏమనగా, నా క్లయింట్లు దిగువ షెడ్యూల్ నందు వివరించబడిన ఆస్తి కొనుగోలుకు సంబంధించి సదరు ఆస్తి యజమానితో ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఆస్తి వివరాలు మరియు యజమాని పేరు షెడ్యూల్ నందు వివరించబడినవి. నా క్లయింట్లు పాక్షిక అమ్మక ప్రతిఫలం కూడా చెల్లించారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి షెడ్యూలు నందు వివరించబడిన ఆస్తి నందు ఏదైనా హక్కు, వాటా, టైటిల్, క్లెయిమ్, స్వాధీనత లేదా ఏ రకమైన ఆసక్తిని కలిగి ఉన్నచో వారు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి **ఏడు (7) రోజులలోగా** సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించగలరు. **ఏడు (7) రోజులలోగా** ఏ విధమైన క్లెయిమ్స్ రానిపక్షంలో ఏ వ్యక్తికి సదరు షెడ్యూలు ఆస్తినందు ఏ విధమైన హక్కు లేదా క్లెయిమ్ లేదని భావించబడుతుంది మరియు నా క్లయింట్ మొత్తం అమ్మకం ప్రతిఫలాన